క్లుప్తంగా

రేపు విగ్రహాల ప్రతిష్ఠాపన

ములుగు రూరల్: ఈ నెల 13న ములుగు మండలంలోని రాయినిగూడెం గ్రామంలో ఆదివాసీల ఇలవేల్పు గుట్టమీది ముసలయ్య, నాగదేవతల విగ్రహాలను ప్రతిష్ఠాపన చేపడుతున్నామని పూజారుల సంఘం అధ్యక్షుడు తవిటి నారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం 1.20 గంటలకు జరిగే విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ



ములుగు: జిల్లా విద్యాశాఖ కార్యాలయం సమగ్ర శిక్ష క్వాలిటీ కోఆర్డినేటర్ ఎఫ్ఏసీగా డీఈఓ ఉత్తర్వుల మేరకు చల్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్ఎం కాటం మల్లారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు పనిచేసిన బద్దం సుదర్శన్‌రెడ్డి ఇటీవల బదిలీ కాగా ఆయన స్థానంలో మల్లారెడ్డిని నియమిస్తూ డీఈఓ ఉత్తర్వులు జారీ చేయగా ఆయన ఉత్తర్వుల ఆదేశాల మేరకు బాధ్యతలు స్వీకరించారు.

ఆర్థికసాయం



ఏటూరునాగారం: మండలంలోని ముళ్లకట్ట గ్రామానికి చెందిన చింత మోహన్‌కు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ దాతల ద్వారా రూ.35వేలు సేకరించారు. సేకరించిన డబ్బులను స్థానిక ఎస్సై కృష్ణప్రసాద్ బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటున్న బ్లడ్ డోనర్స్ అభినందనీయులని అన్నారు. కార్యక్రమంలో బ్లడ్‌డోనర్స్ సయ్యద్ వహీద్, మేరుగు హరీష్, కునూరు మహేష్, గండపల్లి నర్సయ్య, పెంటి భరత్, ఎట్టి స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాదీవెన'కు తరలిన కాంగ్రెస్ నేతలు



గోవిందరావుపేట : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి, మణుగూరులో జరిగిన ప్రజాదీవెన భారీ బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమానికి మండలంలోని కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో చల్వాయి ఎంపీటీసీ గుండెబోయిన నాగలక్ష్మి, అనిల్ యాదవ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పెండెం శ్రీకాంత్, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పులుగుజ్జు వెంకన్న, మాజీ సర్పంచ్ మేకల సుదర్శన్, జక్కి ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

నేడు హుండీల లెక్కింపు

రేగొండ: మండలంలోని కొడవటంచ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మంగళవారం హుండీలను లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కొబ్బరికాయల టెండర్‌కు వేలం పాట నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



మహదేవ్‌పూర్: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఎంపీపీ రాణీబాయి ఆధ్వర్యంలో చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన 106 మంది లబ్ధిదారులకు చెక్కులను అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అరుణ, తహసీల్దార్ ప్రహ్లాద్, ఎంపీటీసీలు సుధాకర్, దుర్గయ్య, మమత, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి కలపకు జరిమానా

కాటారం: మండల కేంద్రంలో సమ్మిరెడ్డి ఇంటి నిర్మాణం కోసం తీసుకొచ్చిన కలప సామగ్రిపై సోమవారం అటవీశాఖ అధికారులు జరిమానా విధించారు. అనుమతి లేకుండా ఇంటి నిర్మాణం కోసం దర్వాజలు, ఇతర కలప సామగ్రి నిల్వ చేశారనే సమాచారంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు ఇన్‌చార్జ్ రేంజ్ అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. అనుమతులు లేకపోవడంతో రూ.55వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట రేంజర్, ఎఫ్ఎస్ఓ అంజయ్య, సిబ్బంది ఉన్నారు.

చెక్‌డ్యాం నిర్మాణానికి మోక్షమెప్పుడో !



ఆనవాళ్లు లేకుండా కొట్టుకుపోయిన కప్పవాగుపై నిర్మించిన చెక్‌డ్యాం



వాగులో ఏర్పాటు చేసిన ఫిల్టర్ పాయింట్

- ప్రశ్నిస్తున్న ఆదివాసీ గిరిజన రైతులు
- కొట్టుకుపోయి ఆరేళ్లు అవుతున్నా పట్టించుకోని వైనం
- రైతుల్లో తీవ్ర ఆందోళన

మంగపేట: మండలంలోని కప్పవాగుపై ఆనవాళ్లు లేకుండా కొట్టుకుపోయిన స్థానంలో నూతన చెక్‌డ్యాంను నిర్మించేది లేదా అన్ని ఆదివాసీ గిరిజన రైతులు ప్రశ్నిస్తున్నారు. మండలంలో దోమెడ అటవీప్రాంతం నుంచి తోగుల ద్వారా వచ్చే నీటితో నిత్యం జీవనదిలా పారే కప్పవాగు నీటిని గిరిజనుల భూములకు సాగునీరు అందించేది. ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ సీవీఎస్‌కే శర్మ 1986లో వీడీసీ పర్యవేక్షణలో లక్షలాది రూపాయలతో నిర్మించిన చెక్‌డ్యామ్ నేడు ఆనవాళ్లు లేకుండా పోయింది. చెక్‌డ్యాం పూర్తయిన నాటి నుంచి 2001–02 వరకు వరకు పాతచీపురుదుబ్బ, కొత్త చీపురుదుబ్బ, సంఘంపల్లి గ్రామాలకు చెందిన సుమారు 5 నుంచి 600 ఎకరాల భూములతో పాటు చెక్‌డ్యాం కింది ప్రాంతంలో నడింగూడెం, రాజుపేట వరకు మరో 200 ఎకరాలకు అదనంగా సాగునీరు పారకం ఉండేదని రైతులు తెలిపారు. అప్పటి నుంచి చెక్‌డ్యాం పరిరక్షణపై ఐటీడీఏ అధికారులు, ఇంజనీరింగ్ శాఖ పట్టించుకోకపోవడంతో 20 ఏళ్ల నుంచి ప్రతిఏటా వాగు వరద ఉధృతికి కోతకు గురికావడం, లీకేజీలు ఏర్పడటంతో శిథిలావస్థకు చేరింది. చెక్‌డ్యాం కొట్టుకుపోయే ప్రమాదం ఉందని తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు పరిధిలోని గిరిజన రైతులు పలుమార్లు ఐటీడీఏ అధికారులకు లిఖిత పూర్వకంగా వినతులు సమర్పించినా ఫలితం లేకుండా పోయిందని రైతులు ఆరోపిస్తున్నారు. 2019 నుంచి గత ఏడాది వరకు కురిసిన భారీ వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహించడంతో చెక్‌డ్యాం కూలిపోయి ఆనవాళ్లు లేకుండా కొట్టుకుపోయింది. ఇప్పటికైనా సంబంధిత ఐటీడీఏ, ఇరిగేషన్ అధికారులు స్పందించి చెక్‌డ్యాం ప్రాంతాన్ని సందర్శించి నూతన చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రైతుల్లో ఆందోళన

కప్పవాగు చెక్‌డ్యాం కొట్టుకు పోయినప్పటికీ తోగుల ద్వారా నిత్యం జీవనదిలో పారే వాగు నీటిపై ఆధారపడి ప్రస్తుతం సుమారు 400 ఎకరాల్లో రైతులు వరిపంట సాగుచేశారు. కొందరు రైతులు వాగు నీటికి అడ్డుకట్టలు వేసి కాల్వల ద్వారా మళ్లించుకుంటుండగా మరి కొందరు రైతులు వాగులో ఫిల్టర్ పాయింట్లు వేసి ఆయిల్ ఇంజన్లు, కరెంటు మోటార్ల సాయంతో పంటలను కాపాడుకుంటున్నారు. ఎగువ ప్రాంతంలో రైతులు అదేవిధంగా వాగునీటికి అడ్డుకట్టలు వేయడంతో వాగు పూర్తిగా ఎండిపోవడంతో కింది ప్రాంత రైతులకు నీరందని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం పంటపొలాలు పొట్ట దశలో ఉండటంతో నీరు అందక రైతుల్లో తీవ్ర ఆందోళనకర పరిస్థితి నెలకొంది.

సమస్యను పట్టించుకునే వారే కరువయ్యారు



25 ఏళ్లగా తమ సమస్యను పట్టించుకునే వారే కరువయ్యారు. చెక్‌డ్యాం కింద నాలుగెకరాల భూమి ఉంది. చెక్‌డ్యాం కొట్టుకుపోయే పరిస్థితి ఉందని సంబంధిత అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాం. అయినా పట్టించుకోలేదు. అధికారుల నిర్లక్ష్యంతో నేడు సాగునీరు వసతి లేకుండా పోయింది.

– మద్దెల పాపయ్య, పాతచీపురుదుబ్బ, రైతు

సాగునీటి వసతి కల్పించాలి



ప్రస్తుత ఐటీడీఏ పీఓ తక్షణమే స్పందించి చెక్‌డ్యాం ప్రాంతాన్ని సందర్శించాలి. సాగునీటి సమస్యతో గిరిజన రైతులు ఎదురొటున్న పరిస్థితిని పరిశీలించాలి. సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ద్వారా చెక్‌డ్యాం నిర్మాణం కోసం నిధులు మంజూరీ చేసి ఖరీఫ్ సీజన్ నాటికి ఆయకట్టు రైతులకు సాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– ఇరుప రమేష్, పాత చీపురుదుబ్బ, రైతు

సాయిబాబా ఆలయ నూతన కమిటీ ఎన్నిక



ప్రభాకర్, అధ్యక్షుడు

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెండ్యాల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా బచ్చు సతీష్, ఉపాధ్యక్షుడిగా పర్వతాల కుమారస్వామి, సహాయ కార్యదర్శిగా గంజి రమేష్, ప్రచార కార్యదర్శిగా లక్ష్మణ్‌లు ఎన్నుకయ్యారు. ఎన్నిక సమావేశంలో ఆలయ అర్చకులు సుదర్శన్ శర్మ, మాజీ అధ్యక్షుడు మేరుగు సత్యం, జాస్తి శ్రీకాంత్, బచ్చు సత్యనారాయణ చెన్న ముత్తయ్య, తాడూరి రఘు, పర్వతాల లాలయ్య, గౌరీ శంకర్, లక్ష్మీనారాయణ, కృష్ణ, కృష్ణ, శేఖర్, రమేష్, వెంకటేశ్వర్లు, స్వామి, తది తరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని అర్చకులు సన్మానించారు.

ఆర్సీఓను ములుగులో ఏర్పాటు చేయాలి



అడిషనల్ కలెక్టర్ శ్రీజకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ములుగు రూరల్: ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జోన్‌కు సంబంధించిన ఆర్సీఓను ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తోకల రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అడషనల్ కలెక్టర్ శ్రీజకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించకుండా నీళ్ల చారుతో భోజనం పెడుతున్నారని అన్నారు. పదోతరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఈ నెల 18 నుంచి ఉన్నప్పటికీ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఇవ్వలేదని అన్నారు. ఆర్సీఓ కార్యాలయం మహబూబాబాద్‌లో ఉండడంతో ములుగు జిల్లాలోని గురుకుల పాఠశాలల పర్యవేక్షణ కరువై పాఠశాల వార్డెన్లు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రవితేజ, స్వామి, శివకేశవ తదితరులు ఉన్నారు.

నేరుగా లబ్ధిదారులకే అందజేయాలి



మాట్లాడుతున్న కిరణ్, నాయకులు

కాటారం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రకటించినట్లు గ్యాస్ సిలిండర్ ధర రూ.500లకే నేరుగా లబ్ధిదారులకు అందజేయాలని ప్రజాసంఘాల నాయకుడు పీక కిరణ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్యాస్ సిలిండర్‌కు ముందుగా మొత్తం చెల్లిస్తే ఆ తర్వాత లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామనే విధానాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. బ్యాంకులకు వెళ్లి డబ్బులు తీసుకోవాలంటే లబ్ధిదారులు పట్టణాలు, మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తుందని ప్రభుత్వం ఇచ్చే రాయితీ పైసలు ప్రయాణ ఖర్చులకే సరిపోతాయని పేర్కొన్నారు. మొత్తం డబ్బులు చెల్లించి గ్యాస్ సిలిండర్ తీసుకోవడం నిరుపేద లబ్ధిదారులకు ఆర్థిక భారంగా మారుతుందని ప్రభుత్వం నిర్ణయాన్ని సవరించాలని కోరారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు అక్కల బాపు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఎస్సైని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

చిట్యాల: నూతనంగా వచ్చిన ఎస్సై గంధమనేని శ్రావణ్‌కుమార్‌ను మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కలిసిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా, దొడ్డి కిష్టయ్య, మూల శంకర్‌గౌడ్, గడ్డం కొంరయ్య, బొట్ల రవి, నందరాజు, బుర్ర శ్రీనివాస్ , అల్లకొండ కుమార్, మాజీ సర్పంచ్‌లు, నాయకులు తదితరులు ఉన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

సాక్షి స్పందన



పైపులైన్ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని పోచమ్మగుడి ఆవరణలోని వాటర్‌ట్యాంక్ వద్ద పైపులైన్ లీక్ కావడంతో మిషన్ భగీరథ నీరు వృథాగా పోతుంది. 'వృథాగా భగీరథ నీరు' అనే కథనం సోమవారం సాక్షిలో ప్రచురించిన విషయం విదితమే. కథనంపై స్పందించిన హన్మకొండ సర్కిల్ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేశం సోమవారం సిబ్బందితో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టారు. దీంతో వృథా నీరు నిలిచిపోయింది. సాక్షి స్పందించి వార్త ప్రచురించినందుకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

ఎస్‌బీఐ ఎదుట ధర్నా

భూపాలపల్లి అర్బన్: ఎన్నికల బాండ్ల వివరాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు మాట్లాడుతూ కేంద్ర ప్ర భుత్వ ఒత్తిళ్లకు లొంగి ఎన్నికలయ్యే వరకు ఎలక్ట్రోలు బాండ్ల వివరాలు వెల్లడించకుండా ఎస్ బీఐ చూస్తుందని ఆరోపించారు. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని తీర్పు చెపుతూ ఈ బాండ్లకు సంబంధించిన వివరాలన్నీ మార్చి 6లోపు ఎన్నికల కమిషన్‌కు అందజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించిన కోర్టు ఆదేశాలు అమలు చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్య, లక్ష్మి, శేఖర్, సురేష్, మహేందర్, రజిని, కిరణ్, శ్రీధర్, రవి, ఉష, స్వాతిలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చిట్యాల : మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన ఓరుగంటి నిరంజన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ సీఈఓ, కాంగ్రెస్ మండల నాయకుడు గుండెకారి శ్రీనివాస్‌రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.15వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆ కుటుంబానికి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు.రాకేష్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, జంపయ్య, విక్రమ్ సింగ్ ఉన్నారు.

పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకావొద్దు



విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలీయాబీ సలీమ్

ఏటూరునాగారం : విద్యార్థులు పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడికి లోనుకావొద్దని జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలీయాబీ సలీమ్ అన్నారు. సోమవారం ఏటూరునాగారం, రామన్నగూడెంలోని జిల్లా జెడ్పీహెచ్ఎస్‌లను సందర్శించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఈనెల 18 నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులను పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడి లేకుండా భయాందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షలు మంచిగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అలాగే మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని భోజన కార్మికులకు సూచించారు. రామన్నగూడెంలోని ఎంపీపీఎస్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌ను కూడా తనిఖీ చేసి తల్లులు, బాలింతలకు పిల్లలకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని వాళ్లే వినియోగించేలా సూచన చేయాలని టీచర్లకు, ఆయాలకు సూచించారు. ఆయన వెంట హెచ్ఎంలు సాంబశివరావు, కోయడ మల్లయ్య, టీచర్స్, తదితరులు ఉన్నారు.

కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి

ములుగు రూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న మతతత్వ, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర చట్టం పార్లమెంట్‌లో చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్‌కు అప్పగిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. దేశంలో వికసిత్ భారత్ అని పేరు చెప్పి 25 కోట్ల మంది ప్రజలను దారిద్రరేఖ నుంచి పైకి తీసుకొచ్చామని అబద్ధపు ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి, రత్నం రాజేందర్, గఫూర్‌పాషా, రవిగౌడ్, యాకయ్య, రవిందర్, ప్రవీణ్, రవి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

వెంకటాపురం(కె) : మండలంలోని 18 గ్రామాల్లో పని చేస్తున్న పంచాయతీ కార్మికులకు వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ కు సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి కట్ల నర్సింహాచారి మాట్లాడుతూ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు గత ఐదు నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి కార్మికులకు వేతనాలు మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పంచాయతీ కార్మికులు రంజిత్, తాటి శ్రీను ఉన్నారు.

రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలి



మంగపేట: విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, స్టేషనరీ అందజేస్తున్న పవన్‌కుమార్‌శర్మ

మంగపేట: పది పరీక్షల్లో విద్యార్థిని, విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని శ్రీ జ్ఞానసరస్వతి పీఠం అధిపతి పవన్‌కుమార్‌శర్మ అన్నారు. మండలంలోని రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 42 మంది పదో తరగతి విద్యార్థిని, విద్యార్థులకు ఆయన పరీక్షా ప్యాడ్లు, స్టేషనరీ హెచ్ఎం భాస్కర్‌రావు ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. అలాగే మండలంలోని ఏహెచ్ఎస్ బ్రాహ్మణపల్లి 11 మంది, ఏహెచ్ఎస్ చుంచుపల్లి 21, కేజీబీవీ చుంచుపల్లికి 11, జెడ్పీహెచ్ఎస్ మల్లూరు 18, జెడ్పీహెచ్ఎస్ నర్సింహాసాగర్ 08, జెడ్పీహెచ్ఎస్ మంగపేట 45, జెడ్పీహెచ్ఎస్ కమలాపురం 40 మొత్తం 160 సెట్లను అందచేశారు. విద్యార్థులు శ్రద్ధతో పరీక్షలు రాసి 10/10 గ్రేడ్ సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్, పావని, వీర నారాయణ, జమున, పద్మ, లావణ్య, మహాదేవి, ఆస్మాబేగం అతదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

మండలంలోని మల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పెసా మొబిలైజర్ తాటి విజయ్‌కుమార్ పరీక్షప్యాడ్‌లు, జామెంట్రీ బాక్సులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక పరీక్షల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఇష్టపడి చదివి జిల్లా రాష్ట్ర స్థాయిలో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, గురువులకు, తల్లి దండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బద్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

- అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



భూ నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

గణపురం : ఓసీ–3 ప్రాజెక్టులో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులందరికీ ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా న్యాయం చేస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రాలు అన్నారు. సోమవారం భూములు కోల్పోయిన 84 మంది లబ్ధిదారులకు చెల్పూరు శివారు రామప్పకాలనీలో 143 సర్వే నెంనంబర్‌లో 200 గజాల చొప్పున ఇళ్ల స్థలాలకు పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం వారు లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ భూములు కోల్పోయిన 250 మంది భూ నిర్వాసితుల నుంచి దరఖాస్తులను స్వీకరించామన్నారు. అందులో గ్రామాల్లో క్షేత్రస్థాయిలో గ్రామ సభలు నిర్వహించి మొదటి విడతలో 84 మందిని ఎంపిక చేసి వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇంకనూ ఎవరైనా అర్హులు ఉంటే తగిన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని, విచారణ చేపట్టి అర్హులను గుర్తించి వారికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలో వైద్యకళాశాలతో పాటు ఆయుష్ ఆస్పత్రి, క్రిటికల్ కేర్ యూనిట్లు ఏర్పాటు కానున్నాయన్నారు. ఈ ప్రాంతం త్వరలో వరంగల్ నగరంలా అభివృద్ధి చెందనుందన్నారు. పట్టాలు పొందిన లబ్ధిదారులు తక్షణమే భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీల్లో భాగంగా భూపాలపల్లి నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. అందులో భాగంగా భూములు కోల్పోయిన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ మంగీలాల్, తహసీల్దార్ మురళీధర్ రావు, ఎంపీడీఓ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



బ్రీత్ అనలైజర్‌తో పరీక్షిస్తున్న ఎస్సై

మహాముత్తారం : మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు ఉంటాయని ఎస్సై మహేందర్ కుమార్ హెచ్చరించారు. మండలంలోని యామన్‌పల్లి, మహాముత్తారం ప్రధాన రహదారుల్లో సోమవారం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహన దారులు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ఎస్సై వెంట సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.